కథా నిలయం
శ్రీకాకుళం

# తడిమంటకి పొడినీళ్ళు

నీళ్ళకోసం నది ఒడ్డు కొచ్చింది అలిమేలు. ఆకాశమంతా మబ్బుతో కమ్ముకున్నా పశ్చిమాన్ని తెరతీసినట్లు నిర్మలమైన ఆకాశం ఎర్రటి తామరాకులా కొండ వెనుక దిగిపోతున్న సూర్యబింబం కిరణాల వెలుగులో గర్భాలయంలో ఒంటిదీపంలా మెరుస్తూంది. ఆ కిరణాల ఎరుపు అలిమేలు మొహాన్ని కవ్వించి, జడలో దాక్కుంది. లేత మబ్బురంగు ఛాయ, స్ఫుటంగా ముందుకు సాగారి ఒంపుతిరిగిన కనురెప్పల కింద తెల్ల చేపపిల్లల్లే సంధ్యలో చిట్లించి కదిలి మెరిపే కళ్లు, సన్నటి పొట్టిముక్కు, తీర్చి దిద్దిన సన్నటి పెదవులు, పల్చటి చెక్కిళ్ళు, క్రమంలేకుండా దువ్విన జడ- ఇవన్నీ అమాయకంగా కనబడేటట్లు చేసినా, మొత్తం శరీరం చూస్తే అనుభవంగల వ్యవహర్తలా కనిపిస్తుంది. అలిమేలు. ఎత్తయిన విగ్రహం, గుండ్రంగా, బలంగా కనబడే భుజాలు, స్తనాలు, పిరుదులు—ఆ పాత తెల్ల చీరమడతల్లో ఇమడక, వాటి వునికిని ప్రతి కదలికలోనూ ఋజువు చేస్తున్నట్లుంటుంది.

కొండకింద దిగే సూర్యుడంటే అలిమేలు కిష్టం. బిందె కిందపెట్టి, సంధ్యవెలుగుకి ఎర్రబడిన చేతులు చూసుకుని సంతోషపడింది. ఇంకా ఎరుపుగా వుంటే ఎంత బావుండును తను. కర్మ, అమ్మ నలుపు. అయ్యకూడా నలుపేనట, అమ్మ చెబుతుంది.

ఊరికే ఆ పొద్దంతా, ఆ ఎంకడు జొరపడుతూండాడు ఆలోచనలోకి, ఆ సైకిలుకొట్టు వెంకటేశ్వర్లు, ఈమధ్య మరీ గర్వంగా, హుషారుగా వున్నాడు. వాళ్ళవళ్ళతోనో తిరుపతివెళ్ళి, వెంకటేశ్వరస్వామినిచూసి వచ్చా

డంట. అందుకు ఆ మిడిసిపాటు. మాబాగా అయింది! సైకిలు పోటీలోపడి కాలుకి గాయం తగిలింది. కట్లుకట్టి కుంటుకుంటూ తిరుగుతూండా డా ఎంకన్న. మిడిసిపడే వాళ్ళకి తగిన శాస్తి చేస్తాడు ఆ ఏడుకొండలవాడు. కాని పాపం మంచోడు-వెంకటేశ్వర్లు-వెంకన్న, తనకి ఒక చందనంబొమ్మ స్వామిది—తెచ్చి ఇచ్చాడు. వెంకన్న బాగుంటాడు; భలే నవ్విస్తాడు; నవ్వుతాడు—నవ్వితే మరీ బాగుంటాడు—మొంచి నునుపైన ఛాతీ—

ఈ ఆలోచన కూడదు. దాన్ని తొలగించడంకోసం అమ్మనిగురించి అనుకోవాల్సి వస్తూంది. అమ్మ మంచిది. తనంటే పంచప్రాణాలూను. పొద్దుననగా వెళ్ళింది సంతకని—ఆ ఎంకడితో—మళ్ళా వెంకడి ఆలోచనా? ఇంకా రాలేదేం చెప్మా. తనని తిరుపతి తీసుకెడతానంది—పెండ్లయి నాక. పెళ్ళేంటి తనకి? కనపడ్డవాడినల్లా అడుగుతుంది వెర్రిది—'కానీ పుచ్చుకోకుండా కట్టుకుంటావా' అని.

తలెత్తి దూరంగా చూసి అదిరిపడింది అలిమేలు. అదేమిటి అంత లావుగా పొంగిపోతుందే నది—ప్రొద్దుటాళ అంత లేదే. 'అమ్మో'—గుండెలమీద చెయ్యిపెట్టుకుని నిర్ఘాంతపోయి చూస్తోంది. నీళ్ళు ఎర్రగా, ఎత్తు అలలగా లేచి రొదిస్తూ విరిగిపడుతున్నాయి. భలే జోరు—సైకిల్ పోటీలా. నురుగు గుండ్రంగా గాలిలో పత్తిలా తిరిగిపోతూంది. చలిగా ఉంది. సూర్యుడు లేడు. కొండెనక దిగి, రోతతో పూసినట్లు విచ్చిన తాడి పండెల్లే ఉండాడు ఆ మూల ఆకాశంమన్న.

నీళ్ళు కెట్లా దిగేది? చీరకొంగు చుట్టూ లాక్కుని బిగించి, సిద్ధపడింది. నీళ్ళెట్లా తాగేది? రోత నీరు. అంతా కంకరమన్ను రంగు. ఓయబ్బా, అవన్నీ కంప, కొమ్మలు, ఆకులు, దూలాలు, ఎక్కడినించో కొట్టుకుపోతూన్నాయి. భయంలేదు. మనుషులున్నారు. లెక్కపెట్టింది. ఏడుగురు మనుషులు—సిద్దీల్లాంటి వాళ్లు, నల్ల దూలాలల్లె ఒడ్డుకెళ్ళి, నీళ్ళల్లో కొట్టుకొచ్చే గంప, పీచునార, దూలాలు పట్టుకుని ఒడ్డుకి చేరవేస్తున్నారు. ఎందుకో ఇంకెందుకు పొయ్యిలోకి కట్టెలకోసం, ఆళ్ళ బందబడ, భయం లేదేం—లోనకి పోతూ ఉన్నారు.

ఆ నల్లటి కడ్డీశరీరం మనుషులు దూలాలు ఒడ్డుకి చేరెయ్యడంలో, కూపబలుక్కున్నట్లు, కొంత లయతో కలిసి పనిచెయ్యడం చూసి, అలిమేలు నదిగొడవ మరిచిపోయింది. బలమైన జబ్బలు, పిక్కలు, కండలు తిరిగి, కదలడంలో లయక్రమం చూసి విస్తుపోయింది. చూడ్డానికి బాగుంది. వాళ్ళ మొహాలు ఎల్లాగుంటేనేం. శరీరం అంతా బాగుంటుందా—అవన్నీ ఎము కలా, కండలా—కాల్చి వొంచిన గునపాలా; బిందె ఎత్తి, దించి, తన చేతుల కండలకేసి చూసుకుంది. తన వల్లా లేవు. అళ్ళు మొగాళ్ళు—మోటగా ఉంటారు. మోటతనం తనకు లేదుగా, అందుకని అదంటె యిష్టం. మరి వెంకన్న అల్లా లేడేం! ఏమో అడు కష్టపడి పనిచేస్తుంటే తను చూడలేదు. ఈమారు చూడాలి ఛ, ఛ—అడి గొడవొద్దు. ఇంకా అమ్మరాలేదేం చెప్మా. వెనక్కి తిరిగి చూసింది. దూరంగా జనం పరుగు లెడుతున్నారు; కందిరీగలల్లే —కందిరీగ కుట్టినవాళ్ళకి మల్లే —

మరో రెండడుగులు ముందుకేసింది అలిమేలు. "అటెళ్ళమోక చస్తావు —కొంపకెళ్ళు" అని అరిచాడు, నల్లశరీరం మనుషులలో వొకడు.

"ఏం ?"

"కళ్ళు లా—కబోదివా ? నీరొస్తా వుంది. లగెత్తు. పోవేం."

కసిరాడు నల్లటయ్య. తనకి భయంగా లేదు. అక్కడ కూర్చుని, ఆ నది రొద వింటూ, నురుగు విరిగే గమ్మత్తు చూస్తూ, ఆ నల్లటోళ్ళ పిక్కల చమత్కారం చూస్తూ వుండాలనిపిస్తుంది.

వాళ్ళు మళ్ళా కసిరారు.

ఇంటికేసి బైలుదేరింది అలిమేలు. వొక్కసారి గంగమ్మతల్లికి నమస్కరించి, ఆ త్రోవమ్మట రోజూ అంత రద్దీ ఉండదు—వూరికి మూడుమైళ్ళ దూరంగా ఉండటం మూలాన. ఆ సాయంత్రం అందరు జనం, బళ్ళు, సైకిళ్ళు కార్లు పోవడం చూస్తూ, తనూ వేగంగా నడవడం సాగించింది. దోవ తొలిగి, అడ్డగాళ్ళల్లోపడి గంటలు మోగుతూ ఎడ్లబండ్లు పోటీలమీద పోతున్నాయి. అడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పడానికి ఎవరూ

నిలబడరు. ఏమిటి చెప్మా! ఇదంతా నదిలో నీటికి భయపడే. వెనక్కి తిరిగిచూసింది. ఎన్నడూ చూడని దృశ్యం — నీళ్ళు నదివొడ్డు మట్టంకి సమంగా, అక్కడక్కడ వొడ్డు పొర్లి పోవడం—తనెప్పుడూ చూడలేదు.

"ఇదిగో—ఏమిటబ్బాయ్—ఎక్కడికి పోతావున్నారు?" అని కేక పెట్టింది.

ఆ కుర్రాడు పరుగెడుతున్నాడు.

"నది గండి పడిందట—అంతా కొట్టుకుపోతుందట...."

ఒక్కసారి వూపిరి నిల్చినట్లయింది. అంతా కొట్టుకు పోవడమే. అలిమేలికి నవ్వొచ్చింది. అరుగో ఆ ముష్టోళ్ళు—నిదానంగా చెట్టుకింద చిదగులు పోగుచేసుకుంటున్నారు. వాళ్ళకిలేని భయం. వీళ్ళందరికీ ఎందుకో. ఇంతకీ అమ్మేదీ? పొద్దుపోయినా రాదేం? నది పొంగుతూందని ఆటకాయించారా? వెంకటేశ్వర్లు ఎంటుండంగా అమ్మకేం భయం? ఆళ్ళనీ, ఈళ్ళనీ అడుగుతుంది కాని, వెంకటేశ్వర్లుని అడగదేం—అదే, తన పెళ్ళి విషయం? ఆడికి—వెంకటేశ్వర్లుకి వోమారు పెండ్లయిందట, మరే మొచ్చిందో దాన్ని ఇడిచేసినాడుట. ఆ ఇడిచేసిన దాన్ని చూడాలనుంది. తనకి. తనకంటె ఎరుపా? బావుంటుందా? చూసి భుజానా చెయ్యేసి 'అయ్యో పాపం' అని, తర్వాత, గట్టిగా లెంప పగలెయ్యాలనుంది ఎందుకో. తన కెందుకో, ఇష్టం ఉన్న వాళ్ళని సముదాయింది, బుజ్జగించి, ఆపైన లెంప పగలెయ్యాలనుంటుంది, అదేం చిత్రమో. తనని చేసుకుంటే, మరొకతి నచ్చితే తనని ఇడిచేస్తాడు. వెంకటేశ్వర్లు—అదీ అమ్మ భయం. మరే, తనంత లోక్వా? తాను చేసుకోకేం, 'చేసుకోను' అన్నాడంటె, ఆడిచెంప పగలదూ! చేసుకుని ఇడిచేస్తే చంపెయ్యనూ? తన మనస్సు ఎలాంటిదో అమ్మకి తెలియదు. ఆ మధ్య సూపరెంటు సూరయ్యగారింట్లో పనికి కుదుర్చుకోమని, ఆరే కబురు పంపితే, అమ్మ వొల్లకాదంది. సూరయ్యగారబ్బాయి—శివుడంట-పోకిరబ్బాయంట. అవుతే-తనకి ఆరింట్లో పని కుదరాలనుంది, ఆ పోకిరితనం ఏమిటో చూద్దామని.

శివయ్య భలే ఆయన. భలేబట్ట లేసుకుంటాడు. ఎగదువ్వ క్రాపింగు, వాచి, కళ్ళజోడు, ముస్తాబుగా ఉంటాడు' ఏమన్నా చేస్తే చెంప పగలేసి సర్దా తీర్చుకోవాలనుంది. కానీ అమ్మ వొప్పదు.

కారు హారన్ మోతకి అదిరిపడింది అలిమేలు. నిలబడి తేరబారి చూసింది. కార్లోంచి దిగింది శివయ్య-ఆయనే- సూపరెంటు సూరయ్య గారబ్బాయి. అదేమిటి రమ్మని చెయ్యి వూపుతున్నాడు! అలుముకుంటూన్న చీకటిలో తనకి ధైర్యంగా ఉంది. ఏం జేస్తాడేమిటి వెళ్ళింది.

"ఇదుగో-కారు తోస్తా?"

తల పంకించింది.

"ఏమిటి తోస్తావా తొయ్యవా ?"

"ఎందుకు ?"

"చెడిపోయింది."

"నిన్నే."

దగ్గరగా వొచ్చాడు సదాశివరావు - జేబురుమాలుతో మొహం తుడుచుకుంటూ. గుప్పున పరిమళం కమ్మేసింది.

వింత వాసన.

"ఎక్కడికి ?"

"అదుగో మా యింటికి - ఎరగవు ? ఆ కొండమీద. రెండు ఫర్లాంగులు."

"నాచేత కాదు."

"ఇంతేనా - అంత ఎత్తుగా లావుగా ఉన్నావు."

కారు వెనుక మరో ఇద్దరు మనుషులున్నారు.

"రా, రా-వో చెయ్యి వెయ్యి" అని వాళ్ళు తొందరచేస్తున్నారు. 'ఊ' అని సదాశివరావు, ఆమె చెయ్యి పట్టుకులాగాడు. అతని అరిచేతి చెమట తన చేతికి తగిలి చీకాకు పడింది. చేతినిండా మట్టి-తనూ వెనక్కి వెళ్ళి, కారుని తొయ్యడం సాగించింది. శివయ్య లోపలికెక్కాడు.

"అక్కడ కాదు, ఇక్కడ."

తనని పక్కకి వచ్చి తొయ్యమంటున్నాడు.

వందగజా లొచ్చేశారు. అక్కడ నుండి ఎత్తు ప్రారంభం.

"ఇక్కడ" అని ఆమె చెయ్యి పుచ్చుకుని, ముందుకిలాగాడు శివయ్య. తన బుజానపడింది చెయ్యి. ఎల్లాగో ఉంది. లేకుంటే యీపాటికి చెంప పగలెయ్యదూ!

ముందు తలుపు ప్రక్కన తోస్తోంది. కాళ్ళకిందమట్టి, అక్కడక్కడ కంకరరాళ్ళు, పాదాలను కోసేస్తునాయి. ఆయాసంతో ఒగర్పు పైకి కనపడకుండా బిగపెడుతోంది. కాని ప్రయోజనం లేదు-బిగపెట్టిన వూపిరి విడిచేసినప్పుడు, ఏదోధ్వని కూడా వస్తోంది కంఠంలోంచి. 'అంత ఎత్తుగా, లావుగా ఉన్నావు' అని వెక్కిరించాడు. తను లావా? ఆ మాట పీకుతోంది. ఎంత సన్నటి నడుం తనది-నాజూకైన వక్షం, నునుపైన బుజాలు-తను లావా-చీరలో లావుగా ఉంటాను కాబోలు-ముతకచీర, పాతది-చుట్టి చుట్టి బొడ్డుకాడ బిగించింది-మరి బొడ్డు కింద కాస్తంత ఎత్తుగా ఉంది నిజమే. అదంతే-అమ్మకి అంతే అందరికీ అంతే. అసలీ మొగాళ్ళకి తెలవదు. ఇంటి కెళ్ళి చూసుకోవాల-లావో కాదో ఆయాసంతో రొప్పుతోంది.-నీటిమీద నూదంటి గాలి పొడుస్తున్నా, చెమట్లు బట్టేస్తున్నాయి. చెమటంటే తనకి గిట్టదు. ఎండపాటేలకూడా, స్నానం చేస్తుంది. ఏసంగిలో నాలుగు దఫాలు. చెమటంటే రోత. కాని ఈ అలుపు చెమటకి వాసనలేదు. అదేంటో; నిలిచి పమిటతో మొహం, మోచేతులు తుడుచుకుంది.

"ఇంతేనా-ఐపోయింది?" అన్నాడు సదాశివరావు పళ్ళిగిలించి నవ్వుతున్నాడు. తెల్లగా ఉన్నాయి. పళ్ళ-కండ్లజోడు బాగుండలేదు. అదేదో దయ్యంలా గుండాడు. చెయ్యి వెయ్యబోతుంటే తొలిగినట్టు మరో అడుగు వెనక్కి వేసింది.

"ఇంకెంత, మరో వంద గజాలు."

అలిమేలు నిలబడింది. ఆమెతోబాటు, వెనక తోస్తున్న మనుషులు కూడా నిలిచిపొయ్యారు. రాళ్ళమీస కూర్చున్నారు. తనూ దూరంగా వెళ్ళి

కూర్చుంది. తలని మోకాళ్ళమీద ఆనించింది. నక్షత్రాలు మెరుస్తున్నాయి. కీచురాళ్ళ ధ్వని పైన నక్షత్రాల దగ్గర నుండి వస్తున్నట్లుగా ఉంది. జనం అలజడి లేదు. నిశ్శబ్దంగా ఉంది. అలసట తీర్చుకోడంలో అలిమేలు పంచప్రాణాలు కుదుటపడి మనస్సు నిర్మలంగా ఉన్నట్లనిపించింది. ఆ క్షణంలో - ఎవ్వరి ప్రమేయమూ పట్టలేదు - తను తానుగా ఎరుగున్నట్లు, తనలో 'తన తనం' గుప్పిట్లో బిగించి చూసుకుని, వోదార్చి, బుజ్జగించి, చివరికి ఫెడీలున లెంపమీద కొట్టినట్లయింది, శివయ్య సిగరెట్టు ముట్టించాడు. హారనేశాడు. ఇద్దరు మనుషులు లేచి తొయ్యడం మొద లెట్టారు.

"ఊ - కానీండి - వచ్చేశాం" అన్నాడు శివయ్య.

తనూ లేచింది. తొయ్యడం మొదలెట్టింది. పాదాల కింద గులక రాళ్ళు చక్కిలిగింతలు పెడుతూ ధ్వనిస్తున్నాయి. గాలి జోరైంది— 'చిరుపెంద్రుకలు' జెడకొప్పులోంచి విడి, మొహాన్ని కప్పుతుంటే ఒక చేత్తో తొలిగిస్తూ మరొకదానితో తోస్తూంది.

"ఇంతేనా - ? అలుపొచ్చిందేం"

అంటున్నాడు శివయ్య ఆమెలో ఒక ఆవేశం వొచ్చింది. ఎందుకు తొయ్యలేదు - తనొక్కత్తే తొయ్యగలదు, పట్టింపుకొస్తే. బలాన్ని పూరించుకుని ఒక ఉద్వేగంతో అవయవాలకి వేరే ప్రత్యేకంగా రోష మొచ్చి తిరగబడినట్లు తన శక్తంతా యీ కాస్త పనికోసమూ ధారవోసి నట్లు, ఏదో పూనకం వచ్చినట్లు తోసుకుంటూ పోతోంది, జడ వూడి పోయింది. బొడ్డుకింద కుచ్చెళ్లు విడిపోతున్నాయి. కొంగు రొమ్ముని విడిచేసి తెరచాపలా లేచి వెనక్కి తోసేస్తున్నది. ఆమె గమనించలేదు. తన రక్తం, మాంసం, ఎముకలు పరాయి సొమ్మైనట్లు - తనకి చెందనట్లు, తనొక యంత్రంగా దేన్నో, ఎందుకో ఎక్కడికో లాక్కెళ్ళడమే లక్ష్యం కానట్లు తోసేస్తోంది.

"వచ్చేశాం - మరో ఇరవై గజాలు కూడా లేదు. నేను వస్తున్నా."

అని సదాశివరావు, సిగరెట్టు పారేసి, కార్లోంచి దిగి, ఆమె వెనకగా

నిలబడి తొయ్యడం మొదలెట్టాడు. అతను తగలకుండా, తాను కొంచెం ముందుగా వెళ్ళి తోస్తోంది. తన అయాసం, ఒగర్పు అంతా బాగా వింటాడు, ఎట్లా ?

'అమ్మో' మని పెద్దకేకతో కిందపడింది అలిమేలు. కాలు మడత పడింది. రెండు జబ్బలూ పుచ్చుకుని ఆమెని లేవదీశాడు శివయ్య. జబ్బలు దులుపుకొని, రెండోవైపుకి వెళ్ళింది. సిగ్గేసింది. తను వోడిపోయింది.

"దెబ్బ తలిగిందా ?"

లేదన్నట్లు, వినిపించుకోనటులు కారు తోస్తోంది అలిమేలు. ఆమె తోస్తున్న వేపు కొచ్చాడు శివయ్య. అదేమిటి అట్లా మీది మీది కొస్తాడు. అట్లా రావడం ఇష్టమేనని అలిమేలు వొప్పుకోలేకపోవడం, నవ్వుగా ఉంటుంది. కానప్పుడు నవ్వే వోపికలేదు. — ఏడ్చేందుకూ వోపికలేదు.

"ఇంద"

శివయ్య ఒక నోటు పైకి తీశాడు.

ఏ రకం నోటో ఆమెకి కనబడ్డంలేదు.

"తీసుకో."

తీసుకుంది, తీసుకుంటే తప్పేమిటి - కష్టానికి కూలి. ఏమనాలో తెలీదు. నవ్వుతే అతనికి చీకట్లో కనబడదు. అకాశాన ఇంకా మబ్బులే - కాస్త తెరిపియ్యకూడదు ? దగ్గరగా తన నవ్వు చూసునుగా.

ఎనకాల తోస్తున్నవాళ్ళకి కూడా చెరో నోటూ యిచ్చాడు. వాళ్ళూ తీసుకున్నారు తనలాగే. తప్పులేదు. అమ్మ కిస్తుంది, అమ్మేది ? ఇంటికాడ కూడొండాలి - వెళ్ళాలి - వెళ్ళింది అలిమేలు.

"ఇదిగో నిన్నే"

వెనకనుండి శివయ్య కేకేస్తున్నాడు.

వినిపించుకోకుండా తనింటికేసి పరుగెట్టడం మొదలెట్టింది అలిమేలు. పరుగు నిల్చింది. బలం అంతా అయిపోయింది. ఒక్కొక్క అడుగే మెల్లగా వేస్తూ ఇంటికేసి నడుస్తోంది. ఎవ్వరూ జనంలేరు. కారు గెంటినవాళ్ళు కొండ అవతలవైపు నుండి వెళ్ళినారు కాబోలు. అక్కడ

ఆ రాళ్ళమధ్య పడిపోయి, నక్షత్రాల కేసి చూస్తూ ప్రాణం విడిచెయ్యాలనుంది అలిమేలుకి. కాని అమ్మో, ప్రాణం ఇడిచెయ్యడమే. తనంటే తనకి అంత ఇష్టం. ఇష్టం గలదాన్ని చెంప పగలెయ్యాలిగా మరి—అందుకని తన బుజాన్ని ఎడంచేత్తో గట్టిగా చరచుకుని, నడవడం సాగించి, పదినిమిషాల్లో ఇంటికి చేరుకుంది అలిమేలు.

మబ్బు పెద్దదై అంతవరకు మినుకు మినుకు మంటున్న పది పన్నెండు నక్షత్రాలుకూడా కనపడడంలేదు. చీకటి వలలో చిక్కుకున్న చేపలా, నలుదిక్కులా భయంతోచూస్తూ ఇంటికి చేరుకుంది. నోటు విషయం అమ్మకి చెప్పకూడదు—కూకలేస్తుంది. చెప్తే మాత్రం ఏం? తనేం తప్పు చేసింది? పనిచేసి కూలి సంపాదించింది. అమ్మమాత్రం ఆపని చెయ్యడంలా—ధాన్యం దంపుళ్ళ కెడుతుంది, మిషనుకుట్లు కుడుతుంది. ఊళ్ళో వాళ్ళ ఊరగాయలకి అమ్మ చెయ్యి చేసుకోవాలి. ఎవ్వరూ జనం కనబడరేం? దూరంగా చెట్ల కింద మున్షివాళ్ళు వెలిగించిన మంట ఆరి పోతూంది— పిలిచింది ఎవరన్నా పలుకుతారేమోనని. అమ్మని కేకేసింది. ఇల్లు దాటి ఫర్లాంగు ముందుకెళ్ళి అమ్మని కేకేసింది. నది హోరు వెక్కిరించినట్లు, వెన్నుమీద చరిచినట్లు వినబడుతోంది.

ఇంట్లో కొచ్చింది. తనకి ఆయాసంగా ఉంది! ఆకలేస్తోంది. అగ్గిపుల్ల కోసం తడుముతోంది. బియ్యం పడెయ్యాలి. రొయ్యి పొడుండబ్బా చేతికి తగిలింది. దాని ప్రక్కనే అగ్గిపెట్టె పుల్ల గీచి ఇలాయి బుడ్డి వెలిగించింది. అది అప్పుడే ఆరిపోయింది. మరోపుల్ల గీసి, లాంతరు ముట్టించింది. ఊపి చూపింది. కాస్త మిగిలిన కిరసనాయిలుతో రొకరొక లాడింది. తన కాకలేస్తోంది. ఉండబట్టలేక, రొయ్యి పొడుం తింది, వూగిసలాడే మంచం పట్టెమీద కూర్చుని కిందనుంచి పరిగెత్తిన ఎలుకని చూసి ఉలిక్కిపడింది.

ఇలాయిబుడ్డి తగిలించేచోట గోడమీద నల్లడాగులో కదుల్తున్న బల్లి నల్లగా ఉంది.

కళ్ళు మూసింది అలిమేలు. తనొక్కత్తె ఉండడం వింతగాఉంది. ఇంకెవరూ లేరు—తను, ఆ ఏడుకొండలవాడు—అంతే. తనమీద తనకి జాలి, భక్తి, విశ్వాసము కుదరడం వొక అనుభవం. పెట్టిమీది అద్దంముక్క చీరతో తుడిచి, లాంతరు దగ్గరగా లాక్కుని, అద్దంలో తన మొహం చూసుకుంది. ఎంత బాగుంది తాను. తను మగాడైతే, అద్దంలో మనిషిని గట్టిగా ముద్దుపెట్టుకుని మరి వొదలదు. నిరుడు తిరణాల కెళ్ళినప్పుడు, ఆ మొగాళ్ల మంద తన వెంటబడటం అమ్మ కూడా చూసింది. ఆలయంకాడ జనం వొత్తిడిలో ఆడెవడో పోకిరీవాడు. ఎదురంగా పరుగున వొచ్చి రొమ్ము మీద ఢీకొన్నాడు. తనకి జ్ఞాపకం. ఆ సరయ్యొకడు. అమ్మ అందుకనే వాళ్ళింటికి పోవొద్దంటుంది. ఆ సరయ్య వోపాలి, దూడల పాక దగ్గర, ముల్లు గుచ్చుకుని కింద పడబోయినట్లు తూలి నడుం గట్టిగా పట్టుకుని—ఓ యబ్బ—ఇక్కడ గిల్లేశాడు—మోటసచ్చినాడు. పమిట తొలగించి తన స్తనాలు చూసుకుంది. నిండుగా, గుండ్రంగా మధ్య సూది పట్టేటంత యెడం కూడా లేకుండా—తనని లావంటాడా—శివయ్య. శివయ్య పీల, రొయ్య లాగుంటాడు—నవ్వుతో అద్దంలో నోరు వొంకరైంది.

పెద్ద చప్పుడుతో నదిలో నీళ్ళు పొంగి, ఇంట్లో కొచ్చివేశాయి. గేద్దాడ మాయలా భ్రమించింది. కాదు-అరొదేమిటి. అమ్మోతడి—ఇంట్లోకే నీళ్ళు—దూరంగా గుమ్మంలోంచి చూసింది అంతా నీరే—నల్లగా, వలలా, మొసలి నోరు తెరుచుకున్నట్లుగా, కాళ్ళని చుట్టేసింది. డబ్బాలు, గిన్నెలు, కుండలు, డిక్కడిక్కమని కొట్టుకుని ఎగురుతున్నాయి, తేలుతున్నాయి. తన పాదాలు మునిగిపోయినాయి. ఎలుకలు కిచకిచమంటూ మంచంమీద పరుగు లెడుతున్నాయి. మంచం పట్టిమీదకి పాకుతున్నాయి నీళ్ళు. అమ్మో, కొంప మునిగింది. కెవ్వన కేకపెట్టి, గుమ్మంకేసి గెంతి, కిందపడింది. లేచింది.

లాంతరు బుజాన తగుల్చుకొని దొడ్డివైపు కొచ్చింది. అక్కడికీ వొచ్చేశాయి నీళ్ళు. కొంప మునిగిందర్రో అని పెద్దగా అరిచింది. అమ్మని పిలిచింది. ఇరుగు పొరుగు వారి పేర్లు పిలిచింది. ఎవ్వరూ పలకరు, ఇదేమిటి యీ ఆపద—ఇంత ఉపద్రవమూ—ఎక్కడికి పోవడం? ఎటూ. "ఇటు", 'ఇక్కడికి' అన్నట్లుగా నీళ్ళు, తుక్కు, దూగర, ఆకు అలము, కట్టెలు, బొగ్గులు, గుడ్డ పీలికలు—అన్నీ నీళ్ళలో కలిసి, తన మోకాళ్ళని పీకేస్తున్నాయి. చలిగా లేదు. కాళ్ళు కాల్తున్నట్లుయింది. నీటి వడిని ఎదుర్కొని ఇంటి లోపలి కెళ్ళింది. ఉట్టి తాడుకి వేళ్లాడుతూన్న రవికను తీసుకుంది. అది పాతది. అది—చినుగుది అతుక్కు తీసి, తనకి పట్టడంలా. గట్టిగా బిగించి తొడుక్కుంది. జడలో పిన్ను తీసి, గుచ్చి, తడిసిన గుడ్డ పీలికను పిండి, మెడ వెనక జారిన జడని బిగించి కట్టింది. నీరు నడుందాక వొచ్చేసింది. ఇది తమాషాలాగుందే. మంచం పక్కన నీటిమీద వెంకటేశ్వర స్వామిదీ—కర్రబొమ్మ ఆడుతోంది. దాన్ని తీసుకొని, పళ్ళల్లో బిగించి, దొడ్డివైపు కొచ్చింది. చచ్చిపోతానా? ఇంక ఆఖరే—వెంకటేశ్వరస్వామికి దయ లేదా. తనని చంపేస్తాడా? ఏం పాపం చేశానని అంతకోపం. చచ్చిపోవడం అంటే ఇదా—ఇంతేనా—కాసిని నీళ్ళు తాగి గుటుక్కు మనడమేనా! తను చావదు. చావంటే అంత సుళువా—అంత ఎత్తయిన, లావైన శరీరం—అంత జోరుగా కొట్టుకొనే గుండెలు—గుండెమీద చెయ్యివేసి చూసుకుంది. చేతివేళ్లు ఆ వేగానికి అదిరిపోతున్నాయి. చప్పుడు వినవొస్తోంది—గుండెకాయ కంఠంలోకి చొరపడ్డట్లు. దొడ్డివైపు కొచ్చి నలుమూలలా చూసింది. అంతా నీరే—మోకాళ్ళదాకా వొచ్చేసింది. చీర పైకి లాగి, గోచీలా బిగించి వెనక్కి మడిచి కట్టింది. దొడ్లో రాక్షసిలా ఎదిగిపోయిన చింతచెట్టుంది. దానిమీద కెక్కితే తనకి బెంగలేదు. కాని ఎక్కటం ఎట్లా? దాని మొదలు తనకంటే రెండింతలు ఎత్తునుంది. ఆ పైకి వెడితే పెద్ద కొమ్మలుగా చీలింది. ఆ కొమ్మలు కుర్చీబల్లలా, ఏటవాలుగా

ఉన్నాయి. ఇంటి చూరుకింద గోడలో, అక్కడక్కడ ఇటికలు వూడగా కంతలేర్పడి పాదానికి పట్టుగా ఏర్పడ్డం, యత్నించి చూసింది. నోట్లో చందనం బొమ్మ, భుజాన లాంతరు, రెండు చేతులతో పైఇటుకలు పట్టుకుని, పాదాన్ని కంతలో ఆనించి, వొకడుగు పైకి వేసింది కింద నీటి ప్రవాహం.

పైని నెత్తికి తగిలే చూరు. ఎట్లా పై కెళ్ళడం? చూరులో పొడుగ్గా విడిపోతున్న రెల్లు, రెపరెపమని చిరిగిపోతూన్న తాటాకులు, ఆ మట్టలు చేతికిచిక్కాయి. కుడికాలు పైకిమడిచి, ఒక్కవూపుతో, చూరుపైకి చేరుకుంది ఆయాసంతో, భయంతో చెమట్లు పోసేస్తున్నాయి. ఆ తాటాకులమీద, ఆ రెల్లుగడ్డిలో మొహం దాచుకుని, ఏడ్చేసింది అలిమేలు. తను బ్రతుకుతుంది-చావకూడదు. దేవుడు కటాక్షించాడు. కాని ఆ లాంతరొకటి. జారిపడితే గడ్డి అంటుకుంటుంది. అంటుకుంటే అంటుకోనీ — ఇంత నీళ్ళుండంగా — కొంప తగులడితేనేం, మునిగితేనేం—'అమ్మో' అని మరో పెద్ద కేక వేసింది —తను కిందకి జారిపోతోంది. ఆ తాటాకులలో, రెల్లులో పట్టులేదు. ఏటవాలుగా కిందకి జారిపోతోంది. మరో క్షణంలో కిందనీళ్ళల్లో పడిపోను లేచికూర్చుని మోకాళ్ళని, తాటాకులలోనికి జొనిపి, మెల్లగా లేచి నిలబడి, చేతికి అందీ అందకుండా అడుగుదూరంలో ఉన్న చింతచెట్టు కొమ్మనిబలంగా పట్టుకుని, రెండు కాళ్ళు ఒక్కసారి పైకి ఎగరేసి, చెట్టు మానుమధ్యలోకి గెంతిపడింది. కళ్ల గట్టిగా మూసుకుంది. చచ్చానా, బ్రతికానా? పొట్టకింద గోకి చూసుకుంది. 'అమ్మో' మని మరో పెద్ద కేకవేసింది. వెన్నుమీద లాంతరు చిమ్ని చుర్రుమంది. చిత్రం ఆరిపోలేదు. చేతులు తనవే. కాళ్ళు తనవే. చేతులకి ఒక్కగాజులేదు —ఉన్న నాలుగూ గోడకి తగిలి విరిగిపొయ్యాయి కాబోలు. మెళ్ళో గొలుసులేదు. ఆ పెట్టెలో ఉండి పోయింది. నెత్తికి కట్టినగుడ్డ తీసేసింది. జుట్టు విడిపోయి, గుబురుగా మెడ వెనక్కి పడేసి సరిచేసి, తడిని ఆరబెట్టేటట్లు చేతులతో చప్పుడుచేస్తూ, జడని

పాయకింద లాగి మ్రానుకింద సన్నగా లేచిన చిరుకొమ్మకి తాడుగా బిగించి కట్టేసింది. మరో పాయిని లాంతరుకి ముడేసింది. వెన్ను మ్రాను మధ్యగా ఆనించి, కాళ్ళు మరో కొమ్మకి తగిల్చి, ఆకాశంలోకి చూసింది అలిమేలు. అది ఆకాశం కాదు—తను పడిపోకుండా పైన కాసుకొని చూస్తున్న వొక శక్తి, వొక వింత—తనెన్నడూ ఎరగని అనుభవం. తన పేరు, ఊరు, అమ్మకొంప, వెనక, ముందు డబ్బు, దసకం, తిండితిప్పలు-ఇవన్నీ మరిచిపోయి కేవలం కండలో ఎముకలో సజీవంగా, ఊపిరి పీల్చి ఉండడమే ఆ వింత అనుభవం నరాలు, గుండెలు, రక్తం, శరీరంలో ప్రతి అణువు, నోరిప్పి పలకరించినట్లు, కన్నులాగై తనలోనికి చూస్తున్నట్లు, నోళ్ళయి తనని తాకి, ముద్దెట్టుకున్నట్లు—తను తనలా కాక, మరొకరిలాగ, ఆ మరొకరు తనుగా అయిపోయి, తన్ను తను కౌగలించుకొని, ఆనందంతో ఒక్కపెట్టున ఏడవడం ఆ వింత.

—

కొమ్మమీద జార్లబడి కళ్ళు మూసుకుంది అలిమేలు. కళ్ళు మూసుకున్నా, తెరుచుకొన్నా ఒకలాగే ఉంది. రెప్పలకింద కెరటాలు, రంగు రంగులవి ఇసుకని కోసినట్లు కవ్వించి, చక్రాలకింద వొకదాని, వెనక వొకటి పెద్ద చక్రంగా మారుతూ చంద్రుడుగా, సూర్యుడుగా కోటి రంగుల సముద్రంగా పైకి లేచి ఆకాశంలో అంతర్ధానమై పోతున్నట్లు, ఆలోచన లేదు – అమ్మని గురించి ఊహలేదు. ఆకలి లేదు—సజీవమై ఉండికూడా నిర్జీవంగా మిగిలిపోవడం లాగుంది.

అది కలకాదు—కింద నీళ్ళు, కాలుజాచితే అందేటంత పైకొచ్చాయి. చెట్టు మొదలు కనబడడం లేదు. ఇంకా పైకొస్తే, ఎక్కడి కెక్కడం—ఆ కొమ్మ చదునుగా, తిన్నగా ఉంది—పైకి ఎక్కేటందుకు పట్టు దొరకదు. కిందంతా నీరు—పైన మబ్బు మూసిన దుప్పటిలా ముడతలుపడి, ఆకాశాన్ని నీటిమయంగా చేసేసినట్లుంది. కింద, పైనా అంతా వొకటే—తేడా లేదు. నిశ్శబ్దంగా ఉన్నా, మరణానికి ముందు రోదించినట్లు వోపగలేని మేఘాలు

డీకొని అయిష్టంగా ఉరికినట్లు, నదీ నీళ్ళ పల్లంలోకి జారిపోతూ సిగ్గుతో మొహాన గుడ్డ కప్పుకుని కింద రత్నాలని, మణి మాణిక్యాలని చీపురుతో తుడిచేసినట్లు —తనకోసం: తన పైకి—కడసారి త్యాగాన్ని నోరువిప్పి అడిగినట్లు ధ్వనిస్తూ పొంగి, పొరలి విచ్చలవిడిగా విర్రవీగి సాగారి పోతూ వుంది.

గుండె దడ తగ్గింది —తనకి తెలీని మార్పుతో శరీరం స్థిమిత పడుతోంది. చావడానికి తగినంత ధైర్యం చిక్కింది. అమ్మ లేనిది తను బ్రదికి ఏం ప్రయోజనం. ఒక్క క్షణం, వూపిరి బిగబట్టి, రెండడుగులు దిగితే, అయిపోతుంది.

అమ్మో—ఎందుకు చావాలి? అమ్మకేం —ఏ లోగిలిలోనో నిక్షేపంలా ఉంటుంది. చిన్నప్పటినుంచి తనెరుగున్న శరీరాన్ని —పాపం గంగపాలు చెయ్యడమా అదేం చేసిందని?

కెవ్వున కేక పెడుతున్నా రెవరో —అదిరిపోయింది అలిమేలు. మళ్ళా గుండెదడ ప్రారంభమైంది. అదిరిపాటులో లాంతరు కొమ్మకి తగిలి, అకోలక్షణా అన్న చప్పుడుతో టప్పుమంది చిమ్ని బీటతీసింది —

ఎవరిదో కేక పెద్దదైంది. మూలుగు, రొద కాపాడమని — అయ్యో, బాబోమని —అరుపు. అది మొగాడి కంఠం. నిలబడి నాలుగు దిక్కులా చూసింది. ఒక కంప తన చెట్టు పైపుకు కొట్టుకొని వస్తోంది. అందులోంచి ఎవరో చేతులు పైకెత్తి మొరెట్టు గుంటున్నారు. దగ్గర కొచ్చేసింది. రెండు చేతులతో కొమ్మని గట్టిగా పట్టుకొని, కాళ్ళు కిందికి నీళ్ళు తాకేటట్లు చాచింది. కొట్టుకుపోతున్న కంపలోంచి పైకి కనబడుతోన్న ఆ చెయ్యి ఆమె పాదాలని గట్టిగా పట్టుకుంది చాలా బరువు. కొమ్మని తన పట్టు నిలవడం లేదు.— జారిపోతోంది.

ఆమె మోకాళ్ల పట్టుగుని మ్రానుమీద ఒక కాలుంచి, ఆ వ్యక్తి కొమ్మ మొగలో ఆమె ప్రక్కనే కూలబడిపొయ్యాడు.

"గట్టిగా పట్టుకో....వొదలకు...." అని వొగరుస్తూ సదాశివరావు ఆమె నడుం గట్టిగా పట్టుకున్నాడు. నీళ్ల నోట్లోంచి బైటకి వొచ్చేస్తున్నాయి.

"కాసేపుంటే చచ్చేవాడినే...."

'అమ్యో' అని ఆయాసంతో హైరాణా పడుతున్నాడు.

"మీరా?" అంది అలిమేలు తెల్లబోయి.

"నేనేమిటి, నువ్వేమిటి చస్తూంటే....

"మెదలకుండా వుండండి-ఇదుగో ఈ కొమ్మకి కాలు ఆనించండి—ఆ—అల్లాగ- ఆవైపు కొమ్మని నడుం ఆనేది. పట్టుకోండి—మాట్లాడకండి" అంది అలిమేలు. నడుంపై నుండి అతని చేతులు తొలిగిస్తూ. అతని గవజులు, అంగిళ్లు తడికీ, చలికీ నొక్కుకుపోయి మాట్లాడలేక పోతున్నా, ఏదో చెప్పాలని, బిగ్గరగా ధ్వనులుచేస్తూ ప్రయత్నంచేస్తున్నాడు.

"ఆఖరకి నువ్వే దిక్కయ్యావు...."

డ్రయివర్ ఉడాయించాడు-నౌకర్లు లగెత్తారు-చివరికి—అది—సువర్ణకూడా—ముందే తెలుసుకుంది కాబోలు—ఈ నది గండిపడి ఉపద్రవం జరుగుతుందని—ఎప్పుడెళ్లిపోయిందో—ఐపులేదు. నేను—నేను...."

అలిమేలు ఆశ్చర్యంతో చూస్తోంది. కళ్లు పూర్తిగా తెరుచుకుని—మొహం అంతా ఒక కన్నైనట్లు.

"మాట్లాడకండి."

"మాట్లాడకపోతే చచ్చిపోను, భయంతో మాట్లాడి తీరాలి—ఇంకా బిగ్గరగా మాట్లాడతాను....నేను....నాలుగింటికి క్లబ్బుకెళ్ళాను—పేట్లాట.... అంటే పేకాట....రమ్మి అంటారులే—నీకు తెలీదు. ఇరవై కాజేశారు. మరో గంటుంటే అడంతా రాబడదను ఈలోగా టెలిఫోన్లు మోగాయి—నీళ్లొచ్చేస్తున్నాయని....కార్లో ఇంటికి బైలుదేరాను. కాస్త దూరంలో కారు చెడింది—వాళ్ళనీ వీళ్ళనీ పోగుచేసి కారుని కొండపైకి

జేరేశాను. ఇంట్లో ఎవ్వరూ లేరు. అవి ఇవి సర్ది, డబ్బు పర్సులో పడేసి కారు రిపేరు పూర్తిచేసి బైట కొచ్చేటప్పటికి, అప్పుడే నీళ్ళు కిటికీ దాకా వొచ్చేశాయి. కార్లో కూర్చున్నా—గరాజ్ తలుపులూడి తేల్తున్నాయి. గట్టి కర్ర—మందంగా ఉన్నాయి. తాళ్ళతో రెండు తలుపులనీ ఒకటిగా కట్టి—వాటిమీదకు గెంతాను.... నువ్వే కదూ—కారు తోసింది—అట్లా చూస్తావేం ?"

ఎవర్నో అన్నట్లు, వెనక్కి తిరిగి చూసింది అనిమేలు. తననే అంటూంట. ఏమనాలి ? ఏమీ మాట్లాడలేదు. కండ్లకి జోడు లేదు. కళ్ళు చిన్నవిగా, లోపలగా ఉన్నట్లున్నాయి. క్రాపింగు నుదుటిమీద పడింది—చొక్కా తడిసింది. వెత్తివ కప్పిన తువ్వాలుతీసి నడుంకి బిగించాడు. ఆ తువ్వాలు తనకిమ్మని సంజ్ఞచేసింది ఇచ్చాడు. బాగా పిండింది. నీళ్ళు వొదిలే టట్లు కొమ్మల కేసికొట్టి అతని చేతి కందిచ్చింది.

"ఏం—అప్పుడు—చూస్తూ చూస్తుండగా, నీళ్ళల్లో తేలిపోతూ, కిందకి పడవలా జారుతూ వొచ్చేశాయి. ఏదో కంపకో, రుప్పకో తగులు కుని నిలిచిపోయింది. ఇరుక్కుపోయింది. అప్పుడు మొదలెట్టింది భయం. ....అన్నీ ముళ్లు కదుపుదామంటే. ఆ కంపనే పట్టుకు కూర్చోవాలి. కేకలెట్టాను. అందులో ఏ పామో కరిస్తే—చస్తాను. అరుపులు, ఏడుపులు"

"నా లాగ భగవంతుణ్ణి తల్చుకోలేక పొయ్యారూ ?"

"చావు రాసుంటే భగవంతుడు కూడా తప్పించలేడుగా. ప్రాణం రక్షించుకొనే సమయంలో నాకెవ్వరూ జ్ఞాపకం రాలేదు—ఆవిడ, నాన్న, అమ్మ, నౌకర్లు—నాకు నేనే—ఆలోచనల్లేదు—బుర్రలేదు—ఊ భయం, ఏడుపు, అనుకో....అమ్మో—చచ్చాను."

అని మోచెయ్యి పట్టుగుని బాధపడుతున్నాడు సదాశివం.

"ఏమిటది ?"

"ముళ్లు—అన్నీ ముళ్లే—చస్తాను...." అలిమేలు రవికకి బిగించిన పిన్ను-కాస్త పక్కగా తిరిగి, బైటకితీసి అతని మోచెయ్యి దగ్గరగా లాక్కుని, ముల్లుని కెలుకుతోంది. "బాబోయ్" "అమ్మోయ్" అంటూనే ఉన్నాడు అతను. మెల్లగా బైటకి లాగింది. చీకిపోయిన ముల్లుని.

"వొద్దు—ఆ బాధకంటె ఈ బాధ ఎక్కువగాఉంది, వొద్దు."

"ఫరవాలేదు."

"ఇదిగో." భుజం చూపించాడు—చొక్కా మెడ కిందికి తోసి, బుజానఉన్న ముల్లుకోసం వేళ్ళతో తడుముతోంది అలిమేలు. దొరికింది పిన్నుతో కెలికుతోంది. అతను పెద్ద కేకపెట్టి ఆమెమీద వొరిగిపోయి గట్టిగా నడుంబిగించి పట్టుకున్నాడు. ఆమె స్తనాలు అతని వక్షం ఎడమ భాగానికి తగుల్తున్నాయి— తడిగా, వేడిగా ....అల్లాగే ఉండిపొయ్యాడు.

కదలడేమిటి? బుజం పట్టుకుని వూపి దూరంగా కూర్చోపెట్టింది.

"వొదలకు—నన్నొదలకు—వొదిలావంటే చస్తాను. భయంగా ఉంది." అని మళ్ళా ఆమెని గట్టిగా పట్టుకుని, చేతులతో ఆమె శరీరాన్ని నిమురుతూ, దేనికోసమో వెదుకుతున్నట్లు ప్రతి అవయవాన్నీ స్పర్శిస్తున్నాడు. ఆమె కిదంతా వింతగా ఉంది; ఎల్లాగో ఉందబ్బా. చక్కిలిగింతగా ఉంది—ఇదేమిటి, పొయ్యేకాలం—ఇట్లా చేస్తాడు?

అతని క్రాపింగ్‌కి, బట్టలకి ఏదో బురద—మడ్డి - తనకి రాసేస్తున్నాడు. నుదురు స్థనాల మధ్యగా ఆనించి పొడుస్తాడేమిటి? పెదవులతో చర్మం పట్టుకుంటున్నాడు - ఇదేం మనిషి - రోతగా ఉంది. తనకి తెలీకుండా అతని తలలో వేళ్ళుపెట్టి తడుముతూ, మడ్డిని తొలగిస్తోంది. ఇంకా గట్టిగా నడుం బిగించి వేస్తున్నాడు—అబ్బ—ఎంత బరువో మొగాడు! తోసేస్తే కింద నీళ్ళలో పడతాడు. ఇద్దరూ పడతారు. ఎట్లా. జుట్టు వేళ్ళల్లో బిగించి, తల పైకెత్తింది. అమ్మో అంటూ లేచాడు - కళ్ళు తెరవడు -

మైకంలో ఉన్నాడా? తాగాడా? చస్తాడా ఏమిటి? తను చంపేసిందంటారా ఏమిటీ కర్మ - ఏమిటి చెయ్యడం? చుట్టూ చూసింది. అన్నివైపులా గుడగుడమని ప్రవహిస్తూ నీళ్ళు. ఆకాశంలో శవంపై కప్పినగుడ్డలా మబ్బులు. అమ్మో, బొడ్డుపైన పళ్ళు తగుల్తున్నాయి. జుట్టట్టుగుని తల పైకి లేవదీసి గట్టిగా లెంపకాయ కొట్టింది - పూనకంవోళ్ళని కొట్టడం తను చూసింది.

కళ్ళు తెరిచాడు. తేరిబారి చూశాడు.

"నువ్వు, నువ్వా కొట్టింది? నువ్వే?"

"తెలివిగా వున్నారో లేరోనని."

నవ్వింది అలిమేలు.

"నాకేం తెలీదు. భయంగా ఉంది. మనిషి కావాలి. నువ్వు కావాలి. నీవొళ్ళు భలే వేడి - నిప్పులా - చలిమంటలా - మెత్తగా, గట్టిగా రబ్బరు బంతిలా...."

ఇంకా చెబుతూండగానే రెండో లెంపమీద మరో దెబ్బవేసింది.

'అబ్బ!' అని అదిరిపడ్డాడు.

అతనికి కోపం వచ్చేసింది.

"ఎందుకట్లా కొట్టావు—"

"మెలుకువగా ఉన్నారేమోనని."

"ఛ, ఛ—కొడతావూ—తోసేస్తే నీళ్ళలో పడి చస్తావు."

"నాకేం భయంలేదు - మీకే భయం. నే నీళ్ళలో పడితే, మీరు ఒంటరిగా ఉండగలరూ - నా ఎనకే దూకుతారు."

"నిజమే - వొంటిగా ఉండలేను-"

అని మళ్ళా ఆమె వక్షంలో మొహం దాచి, శరీరం స్పర్శిస్తూ, గట్టిగా కౌగలించుకున్నాడు.

"వొదలద్దు - నీ కేది కావాలంటే అదిస్తా - మేడా - కారా-నగలా -

నీ ఒళ్ళు ఎంత బాగుందో నువ్వెరగవులే - ఒక పెద్ద శిథిలమైన కోట మధ్యలో తలదాచుకున్నట్లుంది. నీ చేతులు, కాళ్ళు ప్రాకారాలు. నీ రొమ్ములు కత్తులు - నీ జుట్టు వల. నీ కళ్ళు, శత్రువులజాడ తెలుసుకునేందుకు కోట గోడలో కంతలు-"

"ఇయ్యేం పనులు—మంచి బుద్ధులే."

అని దూరంగా జరిగి పట్టు ఒదిలించుకోవాలని పెనుగులాడుతూంది అలిమేలు.

జుట్టుపీకింది. మొట్టికాయలు మొట్టింది -

'బాబోయ్' అని లేచాడు-

చేతికి తగిలిన చందనపుబొమ్మ పైకి లాగాడు.

"బుగ్గకి పొడుచుకుంది—నీ మొల్లోది—ఇదేమిటి ?"

"ఎంకటేశ్వరస్వామి బొమ్మ—మొల్లోదాచా—బాగా అయింది—మరి లేకుంటే అయ్యేం పోకడలు ?"

బొమ్మ లాక్కుంది.

"ఎందుకా బొమ్మ ?"

"ఉండాలి. దేవుడు."

సదాశివరావు బిగ్గరగా నవ్వుతున్నాడు. మూఢభక్తి కాబోలు. కాని నవ్వు క్షణంలో నిల్చిపోయింది. నీళ్ళు 'కసకస'మంటూ పాదాలకి తగిలేటంత పైగా వొచ్చేశాయి. పెద్ద కేకతో ఆమెను గట్టిగా పట్టుకున్నాడు.

"అమ్మో" అంది అలిమేలు.

"ఇంక చావడమే. నీళ్ళు పైకొచ్చేస్తున్నాయి. ఎట్లా ?"

బిక్కమొగం పెట్టి ఏడుస్తోంది. చెట్టు పైకి చూశారు. పైకొమ్మ అయిదారడుగులదాకా, సాఫీగా, తిన్నగా—ఎక్కడా పట్టులేకుండా పైకి లేచి ఆపైన ఒంకర తిరిగి సన్నగా ఒంగిపోయింది. ఆ ఐదారడుగులూ పైకి వెళ్ళడం ఎట్లా ?

ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. మేఘాలు కూడా తలలు కొట్టుకుని ఏడుస్తున్నట్లు ఒకసారి గర్జించి—బురద కన్నీటిధార వర్షంగా వారి నెత్తిన అదతరిస్తున్నాయి.

అతని కళ్ళల్లో మృత్యువంటే భయం ఎట్లాంటిదో చూసింది. కాసేపు మూసుకుపోయి, ఆ మూతలో కాస్త తెరచుకుని నల్ల కొలికలో తెల్ల పాప, నల్లటడివిమధ్యలో సెలయేరులో ఎగిరిపడిన చేపలా తళుక్కుమని, మళ్ళీ చీకటిలో కరిగిపోయిన, 'భయం' అనే గుడ్డుని చూసి ఇదివర కెన్నడూ ఎరగనిజాలితో అతని తలలాక్కుని, తన వక్షంమీద ఆనించుకొని ఏడ్చేస్తోంది అలిమేలు. అంతటా తడి- నీరు-మబ్బె- ఒకరిలో ఒకరు దాక్కుని, కలిసి పొడిచేసుకున్న ఆ కాస్త చోటుతప్ప—అక్కడే జీవం లంగరు వేసుకున్నట్లు, కాసేపు ఊపిరి సలుపుతోంది—తడిలోంచి, నీటిలోంచి, అగ్ని పుట్టించినట్లు—రెండు ప్రాణులు ఒక్క శరీరాన్ని నిలబెట్టినట్లు—ఆమె మోకాళ్ళమీద అతని పాదాలు—ఆమె రొమ్ములమీద అతని మోకాళ్ళు—ఆమె భుజాలపైన అతని తొడలు—ఎక్కడికో పైకి పారిపోతున్నాయి. జలగల్లా పట్టుకుని, ఆకాశంలో తొర్రని వెదుకుతూ—చేతులు ఆమె నెత్తిన పెట్టాడు—పాదాలు భుజాలపైన—నిలబడ్డాడు—ఆ ఒంగిన కొమ్మ మొదలు చేతికి చిక్కింది. పట్టుకున్నాడు—కాళ్ళు పైకి లాక్కుని, ఆ పై కొమ్మమధ్య కూలబడి, గట్టిగా పట్టుకుని, ముక్కుతూ, మూల్గుతూ సజీవంగా ఉన్నాడు సదాశివరావు.

అలిమేలు ఏడ్పు మానేసింది. ఏడవడం సాధ్యం కావడంలేదు. పైకి చూసింది. పీడ విరగడైనాడు, సక్కంగా—మారాజు బ్రతికాడు. అమ్మయ్య ఊపిరి వొస్తోంది. తొక్కి, నలిపేసేసి చంపేశాడు—నీళ్ళు పైకి రానీ, ఎంతవరకొస్తాయో చూస్తాను. చస్తాను, అంతేగందా—అడి చేతుల్లో, కాళ్ళకిందపడి చావడంకంటే, గంగపాలవడం మంచిది. ధీమాగా కూర్చుంది.

"రా, రా, పైకి, రా" అంటున్నాడు పైనుండి.

రానన్నట్టు కిందికి చూస్తూ తల వూపడం అతనికి కనపడ్డంలేదు.

"భయమేస్తోంది. ఇదిగో - నా కాలట్టుగో."

"నే రాను."

"కోపమా ?"

"ఏడుపు."

నవ్వాడు సదాశివరావు. ఏమిటో అర్థం లేని సంభాషణ. తను అడ్డంగా ఉండడం మూలాన వర్షం ఆమెమీద పడుతున్నట్టులేదు. జుట్టు విడదీసి దులుపుకుంటోంది.

"ఇదిగో - తీసుకో."

"పైకి చూసింది. చేతులో ఏదో ఉంది కనబడ్డంలేదు.

"నుంచో - రాకపోతే, నేనే దిగుతాను."

"ఒద్దు. ఇద్దరం పడి చస్తాం."

"ఇద్దరం చస్తే భయంలేదు."

కాళ్ళు ఆమె భుజాలకి తగులుతున్నాయి.

"తీసుకో."

కాళ్ళ వేళ్ళలో ఏదో ఉంది. తీసింది. తడిసిన రూపాయల నోట్లు. తనకంత కోపం ఉన్నట్లు తెలుసుకుని ఆశ్చర్యపడింది అలిమేలు. ఆ నోట్లు తీసుకుని ముక్కలు ముక్కలుగా చించి నీళ్ళల్లో పారేసింది.

"చాలా- ఇవిగో-ఇంకా ఉన్నాయి. దిగుతున్నా". అంటూనే కిందికి దిగాడు సదాశివరావు. ఆమె పక్కగా తొలిగి కొమ్మని పట్టుకుని నుంచుంది. వర్షం నిలిచింది. కింద నది రొద ఎక్కువైంది. నీళ్ళు వేగంగా కదిలి పోతున్నాయి. హెచ్చిన వేగంతో రొద పెరిగింది. ఏవేవో చప్పుళ్ళు. తాటాకులు కాలినట్లు. డబ్బాలు ఢీకొన్నట్లు, దూలాలు విరిగి పడ్డట్లు. తన ఇంటికప్పు కూలిపోవడం చూసింది అలిమేలు. గోడ విరిగి, కరిగి జారి పోయింది. ఇంటి భాగాలు నీళ్ళల్లో పోతున్నాయి—అటు కేసి, నది కేసి,

దూరంగా, ఇంకా దూరంగా చీకట్లోకి. భయంతో వొణికిపోతూ కూలబడి ఆమె తొడలు పట్టుకుని కూర్చున్నాడు. ఆమె వొంటిమీద మిగిలిన చీర చాలా భాగం వూడేపోయింది. ఒక చేత్తో ఆమె స్థనాలు కప్పుకుంది. రెండో దానితో అతని పట్టు విదిలిస్తోంది. మరికొన్ని నోట్లిచ్చాడు. తీసుకొని చించి, నోట్లో నమిలి, నీళ్ళల్లోకి వూసింది.

"అదేమిటి — ?"

"ఉమ్మ్."

"ఛీ,ఛీ — డబ్బు పారేశావా — ఏం ఇదిగా ఉంది. ఎవరవను కున్నావు ?"

"చచ్చినదాన్నను కున్నాను."

"డబ్బు చేదా ?"

"విషం."

అతని భుజంపైన పాదా లానించి, లేచి నిలబడి పై కొమ్మలోకి ఎగబాకి, మధ్య తొర్రలో కూలబడింది.

"నన్నొదిలేసి పోతావా ?"

"నువ్వొదిలెయ్యాలా ?"

ఆశ్చర్యపడ్డాడు. భయంవల్ల కోపం ప్రకటించలేకపోతున్నాడు. అది కోపం కూడా కాదు — అదొక ఉన్మాదం — ప్రాణి మరో ప్రాణిని వెదుక్కుని, నిలబడేందుకు చేస్తున్న ఆరాటం అని కూడా అతనికి తెలియదు. ఆమె కావాలి — ఆ క్షణాన అతను పొందిన అనుభవం — అదొక ప్రశాంతత, ప్రకృతి గుండెల్లో జొరబడి తను నాదై కొట్టుకుంటు న్నట్లు — ఇదివర కెన్నడూ ఎరగడు. దానికి స్వరూపం లేదు — అది కామం కాదు, వాంఛ కాదు, సృష్టిరహస్యం తనలో వుంచుకొని దానిలో ఐక్యత పొంది సజీవుడైనట్లు — ఏమో — కావాలి. ఇంకా కావాలి — లేక పోతే చచ్చిపోతాడు — ఆ కౌగిలింపుతో చావడం ఎంతో అవసరంగా తోచింది. అతని వొళ్ళు తడిమంటలాగుంది. ఆమె పొడినీరుగా — ఏమో - అర్థంలేని ఆలోచనలు.

"వొస్తున్నా—పైకి" అన్నాడు.

అతని కంఠమే మారిపోయింది. నది రొదలా వినిపించింది. ఏవో అరుపులు, ధ్వనులు—భ్రమా, నిజంగానా ? మేఘాలు విడిపోతున్నాయి. తొందరగా కదిలి మధ్యలో నిర్మలమైన ఆకాశం పచ్చటి గాజు పెంకులా, పథ్యం పుచ్చుగున్న చందమామ వెలుగులో మెరుస్తోంది. నీరసమైన చెట్టు నీడలు నల్లగా నీళ్ళల్లో పడికొట్టుకు పోతున్నాయి. ఆ చందమామ చప్పగా ఉంది—కాని అదొక వెలుగులా, శరీరానికి వెచ్చగా తగిలినట్లనిపించింది అతనికి. ఇంక దిగిపోతోంది చందమామ—వెలుగు పిలుపు వినిపించుకోని నల్ల మేఘాలు, వొంటిమీద కాల్చి వాత పెట్టినట్లు అంచుల మీద వెలుగు నీడ మోసుగుపోతున్నాయి. పైకి చూశాడు. ఆ వెలుగులో ఆమె మొహం మీద నీడలు పడుతున్నాయి. అది నోరు, అది ముక్కు రంధ్రం, వొంపు కాబోలు—స్తనాల పైన సన్నటి కాంతికి, కింద వికృతంగా నీడలు సాగుతున్నాయి. జుట్టు భుజాల మీద పడేసుకుంది. అది నడుం వొంపు—నునుపుతో, గుండ్రంగా మెరిసిపోతున్నాయి తొడలు—లేచి నిలబడ్డాడు—ఆమె రెండు పాదాలు తన మొహం మీదికి లాక్కుని, తల ఆమె వొడిలో దాస్తున్నాడు.

ఏదో చప్పుడు. త్రుళ్ళిపడ్డాడు. దూలాల మోత. మనిషి అరుపు—పెద్ద పెద్ద కేకలు—దూరంగా—నలుదిక్కులా పరకాయించి చూశాడు.

"ఏమిటది—అరుపు—వినబడుతోందా ?"

సమాధానం లేదు.

"నిన్నే."

ఆమె మిగిలిన చీరని నడుం చుట్టూ బిగించుకుంటోంది. ఆమెకి అతన్ని చూస్తే జాలి పుడుతోంది. పాపం—బ్రదికాడు—భలే కౌగిలించుకుంటాడు. తనకి అదో లాగుంది. మనిషి తాకిడి కావాలి. చలి, భయం, బాధ. మొగాడి వొళ్ళు భలే ఉంటుంది—ఆ బుజాలు, కండలు—ఆ కంఠం, చేతులు, వెచ్చగా, తడిగా, వేడి రక్తం—నది వొడ్డున నల్లటి

మనుషుల కండలు కదలిక జ్ఞప్తి కొస్తోంది. చెయ్యి పెట్టి తాకాలనుంది. మోటగా ఉంటుంది. మోటతనం తనకి గిట్టదు కాని అదే కావాలనుంటుంది ఎందుకో. ఆయనంటే రోత—గిట్టదు. కాని ఆ శరీరం అల్లా తాకితే హాయిగా ఉంటుంది. ఆ తలలో వేళ్ళుపెట్టి, వెంట్రుకలని పీడించి, లెంప పగలెయ్యాల నుంటుంది—ఇదంతా ఏమిటో. వెంకటేశ్వర్లు జ్ఞప్తి కొచ్చాడు—పెద్దోడే—ఆడి వాళ్ళు ఈసారి బాగా తాకిచూడాలి. ఇంతైనాక. తనకేం భయం? ఇదంతా బ్రతికి బైట పడింతర్వాత గదా—ఈలోగా ఈయెనెట్లా—ఏదో చేసేలాగున్నాడు — ఇదేం కర్మ — అప్పుడు, అక్కడ, ఎవరు ఎవర్ని ఏం చేస్తే ఏం గాను—ఎవరిక్కావాలి—ఎవళ్ళ బ్రతుకులు వాళ్ళవి.

ఎవళ్ళకి తెలియదు. అమ్మకి తెలియదు. వెంకటేశ్వర్లుకి తెలి—

"అలిమేలా" అంటూ వున్న కేక విని నిలిచిపోయింది. మళ్ళా మళ్ళా 'అలిమేలూ' అని పిలుస్తున్నా రెవరో. అవును, తన పేరే. ఎటు? ఎక్కడనుంచి? అటూ ఇటూ చూస్తోంది. నీళ్ళు కిందకి దిగిపోతున్నాయి. బాగ బాగి కిందకి—మరీ వేగంతో నదివైపు పల్లంలోకి.

ఎవళ్ళో గంగమ్మతల్లి పీక నులిమినట్లు, ఏడుస్తూ, రోదిస్తూ, బాధ నుండి తప్పించుకు పారిపోతున్నట్లు, ఏమీ చేతకాక కసితో అన్నింటినీ పాడుచేసి పోవడం మంచి దన్నట్లు, నీళ్ళు అందినదాన్నల్లా తోసి. త్రవ్వి, తన్ని, తన వెన్నుమీదికి లాక్కుని ఉడాయిస్తోంది. ఆ కేక అటునుంచి—అన్నీ రుప్పలు, పుంతలు, చెట్లు చేమ, డబ్బాలు, పెట్టె, దూడ, మేక, కర్ర కంప, వేగంతో తను కూర్చున్న చెట్టు మొదలు చుట్టూ ప్రదక్షిణం చేసి, బలికెళ్ళే మేకపిల్లలా, పీక తెగిన కోడిలా తిరిగి తిరిగి, కొట్టుకు పోతున్నాయి. తన పేరు స్పష్టంగా వినబడుతోంది. సందేహం లేదు.

"ఎవరిది?" అని కిందనుంచి సదాశివరావు.

మళ్ళా పిలుపు 'అలిమేలూ' అని.

'ఆ' అని బిగ్గరగా పలికింది. పలికింది కాని కంఠంలోంచి మాట

పైకి రాలేదు. నొక్కుకుపోయి గాలిమాత్రం బైటకొచ్చింది. గొంతుకు సవరించుకుని, మరోసారి 'ఆ' అన్నది. కంఠంలో జీర—కత్తితో ధ్వనిని చీల్చినట్లు, దుప్పటి కప్పి పీకని నులిమినట్లు—'ఆ' లాభంలేదు. ఏదో అనాలి.

'ఊ, నేనే....ఇక్కడ' అన్నది అలిమేలు. కొన్ని ధ్వనులు, బైట పడ్డాయి. ఇంక ఫరవాలేదు. అదిగో ఆ కొండవైపు నుండి ఏదో ఆకారం, తను చెట్టువైపుకి వొస్తోన్నట్లుంది. మళ్ళా 'అలిమేలూ' అని కేకలు.

"ఆ, ఇక్కడ—ఇక్కడే' అని బిగ్గరగా పలికింది.

"నోరు మూసుకో. అరవకు" అంటున్నాడు శివయ్య.

మళ్ళా, మళ్ళా 'అలిమేలూ' అన్న కేక పెద్దదవుతోంది. ఆ ఆకారం—దేనిమీదో నిలబడి — పిలుస్తున్నట్లుంది దూలాలు కాబోలు—ఏదో పడవలాగుంది. అతనే—వెంకటేశ్వర్లు పిలుపు. తన వెంకటేశ్వర్లు. తబ్బిబ్బుగా లేచింది—బొడ్డుకింద చీర కొంగు బిగించింది. అమ్మయ్య. వెంకటేశ్వరస్వామి బొమ్మ భద్రంగా ఉంది.

"ఇక్కడే—ఇటు" కేకలేస్తోంది.

అది పడవలాగుంది. ఇటొస్తున్నాడు.

"ఇక్కడ—నేనే—రా, రా, ఇటు"

అంటోంది. దిగాలి—కింది కొమ్మలోకి దిగాలి. ఈ సదాశివయ్య లేచి నిలబడితే బాగుండును. భుజం మీద కాలుపెట్టి దిగొచ్చు. దిగాలి.

"ఇగో—చూడు—"

అతను తనకేసి చూడ్డంలేదు. ఎట్లా ?

"వొచ్చే, వొచ్చే" అని అరుస్తున్నాడు వెంకటేశ్వర్లు. దగ్గర కొచ్చేకాడు.

"ఇటు, ఈ చెట్టుమీద" అన్నది అలిమేలు.

చెట్టు మొదట్లో దూలం పడవ తగులుకుని చప్పుడైంది. లేచి నిల బడ్డాడు వెంకటేశ్వర్లు.

నెత్తికి ఏదో తుమాలులాంటిది కట్టుగున్నాడు. చొక్కా లేదు. పొట్టి లాగు—వాడే—

"ఇక్కడ" అంది.

చెట్టు మొదట్లో తడుముతున్నాడు—పట్టుకోసం.

"అమ్మేదీ—నువ్వు బాగుండావా ?"

"అమ్మ బాగుందిలే...."

ఏవో ధ్వనులు చేస్తున్నాడు. ముక్కుతూ, రొప్పుతూ, పట్టు చిక్కినట్లుంది. పాదం ఆనించాడు, ఒక చేత్తో కొమ్మ మొదలు పట్టుగుంటున్నాడు. ఒక చేత్తో కర్రబొమ్మ గట్టిగా పట్టుకుని, రెండో దానితో కొమ్మని కౌగలించుకుని, మెల్లగా కింది కొమ్మలోకి జారింది అలిమేలు. శివయ్య వెన్నుమీద పాదం ఆనింది. ఏదో పెద్ద చప్పుడైంది. అదరి కిందికి చూసింది—ఏడీ ? వెంకటేశ్వర్లు లేడు. 'దబ్బు' మని చప్పుడు—పడ వేదీ ? లట లట మంటూ దూరం పడవ కొట్టుకుపోతూంది—మనిషి లేడు - ఏడీ ?

"తోసేశావా ?"

అంది, సదాశివరావుకేసి కోరగా చూస్తూ.

అతని చెయ్యి ఆమె నోటిమీద పడింది. రెండో చెయ్యి రొమ్ము మీద పెనవేస్తోంది. చేతిని కొరికింది. 'అమ్మో' అన్నాడు సదాశివరావు. తేరుకుని చూసేసరికి ఆమె లేదు. నీళ్ళల్లో చప్పుడైంది. దూకేసింది. పడిపోయింది—నీళ్ళల్లో కొట్టుకుపోతూంది. తన్నుకులాడుతోంది. జల జల కొట్టుకుంటూంది—'అమ్మో !' 'వెంకటేశ్వర్లూ' - 'అయ్యో' అని కేకలు పెడుతోంది. అదేదో రుప్పలాగుంది. అందులో ఇరుక్కుంది. తను దూకితే— ? దూకగలడా ? దూకి ఏం ప్రయోజనం ? మోహం మోకాలు

మధ్య దాచుకొని, అయిష్టంగా, కళ్ళు సగం తెరిచి ఆమె కొట్టుకుపో తున్న దృశ్యం, తనెరగనట్టు, తనకి తెలీనట్టు చూస్తూ, గజగజ వొణికి పోతూ కూర్చున్నాడు సదాశివరావు.

ఇంక మరి కేకలు లేవు. అరుపులు లేవు. వెనక్కి మళ్ళుతున్న నీటిరొద తప్ప అంతా ప్రశాంతంగా వుంది.

గుండెలు కొట్టుకోడం లెక్కపెడుతూ కాలం తెలుసుకోలేకపోతు న్నాడు.

నీళ్ళు గబ గబా జారిపోతున్నాయి. వొస్తువుల, కళేబరాలు శిల్పా లల్లే బురదలో ఇరుక్కుని నిల్చిపొయ్యాయి—పల్చటి పొరలా నీరు అక్కడక్కడ పారుతోంది—పాము కుసంలా—ఆ చెట్ల మధ్య, ఈ రాళ్ళ మధ్య, దూరంగా కొండ కనబడుతోంది. దానిమీద మిగిలిన తన బంగళా—నుదుటిమీద చుట్టకాల్చు మచ్చలాగు. అక్కడక్కడ బురద మరకలు. చందమామ లేదు—గాలి స్తంభించింది. ఆకాశం, పసివాడి వొంటిమీదనుంచి కప్పు తీసేసినట్టు ముడుచుకొని తన్నుకునేటందుకు వోపిక లేనట్టు, నిశ్చలంగా ఉంది. అది కాకిరెక్క—ఇది కుక్క కాలు, అది కంప, ఇవి గుడ్డపీలికలు. నాగరికత ముసుగులోంచి బైటపడగా మిగిలిన ప్రకృతి—తనొక్కడే సజీవుడై వున్నాడు—ఉన్నాడా? కళ్ళు విప్పి చూశాడు—వొంటిని గిల్లి చూసుకున్నాడు. ఊపిరాడుతోంది. ధ్వనులు వినబడుతున్నాయి. కనబడుతున్నాయి. దూరంగా ఆ కొండపక్క ఒక దీపం. మనుషుల అలజడి—అస్పష్టమైన కేకలు, ఏడ్పులు. తెప్పల మీద జనం అటూ యిటూ నదిపై పున వొస్తున్నారు. అక్కడ నీరు పల్చ బడింది. అటు ఎత్తు. పడవలు నిలిచిపొయ్యాయి. తను కూర్చున్న చెట్టు కింద నీరు అంత లోతు లేదు. దిగి చూడొచ్చు. ఆ మడ్డిలోకి, రొంపిలోకి ఎట్లా దిగడం? తనకింకా ధైర్యం లేదు? ఆ పిల్ల ఏమైందో? ఎక్కడో ఇరుక్కుని ఉంటుంది. వాడు, వాడేమిటి మధ్యలో—ఎందుకొచ్చినటు

ఖలే సాహసం—రక్షించాలని వచ్చినట్లున్నాడు. ఏమైంది ? కాలుజారి పడి పోయ్యాడా ? 'నువ్వు తోసేశావా ?' అన్న అలిమేలు ప్రశ్న వినబడు తోంది. తనెందుకు తోస్తాడు ? తన కాలుకి వాడి చెయ్యి తగిలి పట్టు సడలి పడిపోయ్యాడా ? అంతేనా ? తొయ్యలేదు. ఏమో. తనకేం జ్ఞాపకం లేదు. అసలు ఆ పిల్ల చెప్పేవరకూ వాడు పడ్డట్టే తెలియదు.

"తోసేశావా ?" అని ఆమె ప్రశ్న కంటె, ఆ ప్రశ్న అడిగి నప్పుడు ఆమె కళ్ళల్లో చూపు అతన్ని మరింత బాధిస్తోంది — నిజంగా తను తోసేసినట్లు, నమ్మేటట్లు చూసింది. కోరగా, నల్ల పాప ఒక మూలగా లాగి, తన బలాన్నంతా ఆ తెల్లపాప మధ్యలో పూరించి, నల్లటి ఆకాశం మధ్యలో విరిగిన మెరుపులా, ఆ క్షణము వొక జ్వాలగా ప్రజ్వరిల్లి దహించినట్లు—అబ్బ !—ఆ అబలకి, అమాయకపు పని పిల్లకి— అంతటి శక్తి, బలం ఉండడం తను తట్టుకోలేకపోతున్నాడు. శరీరానికి, తెలివికి ఏం సంబంధం ఉన్నట్లు ? ఆ చూపులో ఆమె నిజస్వరూపాన్ని దర్శించినట్లై సిగ్గుతో తల వొంచుకున్నాడు. కొన్ని కోట్ల కన్యలు అతని కేసి వేలు చూపి, వొక్కసారి కసరి చూసి, పురుషజాతికి ఆ క్షణాన ఏకైక ప్రతినిధిగా ఉన్న తనని, నేరస్థునిగా తీర్పు చేసి, శిక్ష విధించి అంతర్ధానమైన అశరీరశక్తిలా —అతనది మరచిపోలేదు. కళ్ళు గట్టిగా మూసుగున్నాడు సదాశివరావు.

వెన్ను విరుచుకుని లేవడానికి సిద్ధంగా వున్న సూర్యుడి పయనం తెలుపుతూ, బాకాలతో సాటింపుకి బయలుదేరినట్లు కిరణాల కొనలు ఆకా శాన్ని తాకి, మైల పడుతున్నట్లు, వెల వెల బోయి, నీరసించి, క్షీణించి మంచాన పడిన ప్రకృతిని బలాత్కారంగా లేపి కూచోబెడుతున్నట్లు— అలిమేలు ఆఖరి చూపు అతన్ని తనలోకి నెట్టి, మరి లేవక అణగార మన్నట్లు స్తబ్ధుగా కూర్చుండిపోయా డతను— ఆ తీక్షణమైన చూపులో. రొమ్ములపోటు, బుజాల వొత్తిడి, పొత్తి కడుపులో—మృదువైన బింకం

ఆ తొడల తొక్కిడిలో మెత్తదనం—అర్థన్ని ఆ చూపులోంచి పరకా యించి చూసి, తనలో తనని బంధించి, ఆ చీకటి కూపంలోంచి, కోటి సూర్యుల కిరణాల ఫహారాగానం లేవనెత్తలేవేమో.

ప్రపంచంలో మనుషులు రెండే తెగలు—చంపేవారు, చంపలేని వారు. తాను రెండో తెగవాడు. కాని కాని—అలిమేలు ఫిర్యాదు? ఇంతకీ ఎవరూ చావందే తన కెందుకా భయం? వాడు — వాడెవడో వొచ్చాడు—ఆమెని తీసుకెడదామని—ఏమవును? చస్తే మాట. ఇద్దరు చద్దురు. ఆ అవాంతరం తను తప్పించాడా? చోటుకోసం తన్నుకులాడుకుని, ముగ్గురూ నీళ్ళల్లోపడి చస్తే, ఎవరు ఎవర్ని చంపినట్లు!

కళ్ళు మూతలు పడవు—కాని చూపు అనదు. ఇంక ఆలోచన లేదు. నత్తగుల్లలో పురుగులా మనస్సు మడతలు పడి, వొంటి అవయవాల మధ్య ముడుచుకుంది. ఎక్కడో మరో లోకంలో ధ్వనులు — మరో యుగంలో దృశ్యాలు—మనిషి రాకపూర్వం భూమిపై తిరుగాడిన ప్రాచీన జంతుజాలం కళేబరాలు, కొండరాళ్ళ మధ్య ఇరుక్కుని, కోటి సంవత్స రాలకి కొండ పగిలి మధ్య జాడ మిగిల్చినట్లు-ఏవేవో కనబడతాయి—దూరంగా దీపాలు—మనుషుల గుంపులు—బృందాల ఏడ్పులు - స్మశానంలో మంటలు - వస్తువులు, మట్టినీరు, తడిమంటలో తెల్లగా మెరిసిన ఎముకలు అర్పుతూ పొడినీళ్ళు పడుతున్నాయి ఆకాశములోంచి.

పక్షుల అరుపు కాదు—మనుషులు-

"దిగండి."

తల పైకెత్తి చూశాడు మిగిలిన కంటితో మనుషులు. మనుషులు-తన కోసం - డ్రైవరు - తనెరుగున్న పోలీసు - నౌకర్లు-ఇంకా ఎవరో-సంచులు, కర్రలు, తాళ్ళు. "దిగండి...." దింపుతున్నారు - దేనిమీదో పడుకోబెట్టారు ఎటో లాక్కుపోతున్నారు. వెలుగు వెంటాడి, పెరిగి మూలల్లో విరిగిపోతోంది. కింద నీరు, బురద, ఆకులు, చెమ్మ - బంక - మడ్డి - పెట్టి, కుక్కతోక, మేక కాలు, గంపకింద కోళ్ళు - అది సూర్య కిరణం, కంటి రెప్ప కింద - రెప్పకింద తారట్లాడుతున్నది - ఆమె కంటిలో

చివరి చూపు - వేళ్ళతో రెప్ప లోనికి నెట్టి, క్షణం చూశాడు - అదిగో ఒక గుంపు - మధ్యలో ఎవరివో కాళ్ళు - ఎవరివో చేతులు - చుట్టూ మనుషులు -

"చచ్చింది పాపం -"

ఎవరో అంటున్నారు ఎవరో.

చేతులో కర్రబొమ్మ -

వెంకటేశ్వరస్వామి కర్రబొమ్మ - చేతిలో

ఉండిపోయింది. ఎవ్వరో అంటున్నారు.

'అదే - అలిమేలు.'

'అడికేం - అదుగో ఆ సైకిల్ కొట్టువాడు - వెంకన్న' 'అమ్మ కొంపలో లేదుగా. సంత కెళ్ళింది.' "దానికేం" "ఇదీ" "ఒకర్తె" "పాపం - చచ్చింది."

మరి ....ఈనకేం - ఆమె ముందుగానే.... "సువర్ణమ్మగారు పదిలంగానే ఉన్నారు. ఇంటికి వొచ్చేశారు.

లేచి కూర్చున్నాడు సదాశివరావు. గుంపు దూరమై పోయింది. ఆ నిక్కరేసుకున్న వాడేనా వెంకటేశ్వర్లు! బాగానే ఉన్నాడే.

సముద్రంపై ఒక ఆవిరి తెర ఆకాశంలోకి లేచినట్లు, అతని మనస్సులో ఒక భాగం ఎక్కడికో లేచిపోయింది, ఊపిరి సాఫీగా రావడం లేదు - కాలిపోతున్న ఎడారి ఇసుకలో, ఎక్కడ పడినా కరిగి పోతానని భయపడి కిందికి పడని మంచుకణంలాగు, గుండె తటపటా యిస్తోంది.

అక లేస్తోంది కర్మ. ఇంటికి వొచ్చేశారు -

నీటి మేడ, తడి మంటలో కాలిపోతోంది -

చర్మం పీకిం తర్వాత ఎర్రటి మఱచి మచ్చ - కిరణం తాకిడితో కొన వూపిరితో నిలబడి తనిల్లు-ఏకాంత మహా సంగ్రామంలో చావగా మిగి లిన తను - కంటి నీరు పొడిగా కారుతోంది. పొడి నీటితో అతడి మంటని చల్లార్చగలడా ? - చల్లార్చగలగడం వింతలలో వింత.

— ★ —